క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా గణేష్

సీతంపేట: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉత్తర నియోజక వర్గానికి చెందిన మేరువ గణేష్ ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితుడయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు విడుదల చేసింది.

నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

మర్రిపాలెం: ఏపీఈపీడీసీఎల్ జోన్-2 పరిధిలోని ఆర్‌వీ కలెక్షన్ సెంటర్లలో ఆదివారం కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని ఈఈ బి.కె.నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జోన్-2 పరిధిలోని గాజువాక కలెక్షన్ సెంటర్ ఈఆర్‌వో కార్యాలయం, పెదగంట్యాడ, కంచరపాలెం, మాధవధార వుడా కాలనీలోని ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్ కార్యాలయంలో వినియోగదారులు ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని చెప్పారు. ఈ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఈఈ కోరారు.

ఘనంగా పాలుగొలుపు ఉత్సవం


సేవా గరిడీలో పాల్గొన్న కె.కె.రాజు, సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట నాయుడు వీధిలో ఒమ్మి చిన్నోడు ఆధ్వర్యంలో శనివారం పాలుగొలుపు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ముఖ్య అతిథిగా, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్‌తో కలిసి ఉత్సవంలో పాల్గొని వరహాలక్ష్మి నరసింహ స్వామిని దర్శించి పూజలు చేశారు. సేవా గరిడీ, తప్పెటగుళ్ల కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సొనబోయిన సురేష్, భోగవిల్లి గోవింద్, సారిపిల్లి గంగరాజు, నమ్మి వెంకట్, వెంకటరమణ, అశోక్, సన్నీ, కమిటీ పెద్దలు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం


పేదలకు భోజనం వడ్డిస్తున్న గొల్లమాల అప్పారావు

కంచరపాలెం: అన్నార్తుల ఆకలి తీర్చడమే లక్ష్యంగా కంచరపాలెం రాంజీ అభ్యుదయ సేవా సంఘం పనిచేస్తోందని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, సంఘ గౌరవ అధ్యక్షుడు గొల్లమాల అప్పారావు అన్నారు. ఈ సంఘం ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా ఆయన ప్రారంభించి పేదలకు భోజనం వడ్డించారు. సంఘం చేస్తున్న సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఉంటుందన్నారు.

ఎంసెట్, నీట్, పాలిసెట్ ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ

దాబాగార్డెన్స్ : ఎంసెట్, నీట్, పాలిసెట్ ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు శ్రీసత్యసాయి సేవా సంస్థల రైల్వే ఏరియా సమితి నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఎంసెట్, నీట్ ప్రవేశపరీక్షకు సంబంధించి ఈ నెల 24 నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయని, పాలిసెట్‌కి సంబంధించి ఏప్రిల్ ఒకటి నుంచి ఉచిత తరగతులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. శిక్షణ తరగతులు శ్రీసత్యసాయి సేవా సంస్థలు, సాయి సౌథ మందిరం, రైల్వే ఏరియా సమితి, పోర్టు స్టేడియం ఎదురుగా, అక్కయ్యపాలెం, ఎన్‌జీజీవోస్ కాలనీలో ఉంటాయని చెప్పారు. రిజిస్ట్రేషన్, మరిన్ని వివరాలకు 92480 52173, 63003 66227 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేద్దాం

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పిలుపు
- 14, 26, 45, 55 వార్డుల్లో పార్టీ ఎన్నికల కార్యాలయాల ప్రారంభం


14వ వార్డులో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కె.కె.రాజు, అనిల్‌కుమార్‌రాజు


26వ వార్డులో పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతంపేట: ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ వారధిగా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 26వ వార్డు శంకువానిపాలెం చాకలిపేట వద్ద పార్టీ వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో కె.కె.రాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఉత్తరాంధ్ర ప్రజలు తమ సత్తా చూపాలన్నారు. మహిళా సాధికారత, స్వావలంబనకు పెద్దపీట వేసిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఉత్తర నియోజకవర్గంలో మునుపెన్నడూ లేనివిధంగా అన్ని వార్డుల్లో అభివృద్ధి జరిగిందని, ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందజేశామని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించి పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో వీకేపీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, ఫ్లోర్ లీడర్, ఎన్నికల పరిశీలకుడు బాణాల శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ బులుసు జగదీష్, మహమ్మద్ ఫరూఖీ, సీనియర్ నాయకులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, గృహసారథులు, మహిళలు పాల్గొన్నారు.

నూతన కార్యాలయంలో పూజలు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు పోర్ట్ స్టేడియం ఈస్ట్ గేటు వద్ద కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఎన్నికల కార్యాలయాన్ని శనివారం పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ప్రారంభించారు. అనంతరం కార్యాలయంలో పూజలు నిర్వహించారు. స్థానిక పార్టీ శ్రేణులతో ఆయన కాసేపు చర్చించారు. కార్యక్రమంలో వీకేపీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, 14వ వార్డు నాయకులు పాల్గొన్నారు.

పార్టీ కేడర్‌ను బలోపేతం చేయండి

తాటిచెట్లపాలెం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వార్డు స్థాయిలో పార్టీ కేడర్‌ను బలోపేతం చేయాలని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పిలుపునిచ్చారు. తాటిచెట్లపాలెం దరి 80 ఫీట్ రోడ్‌లో ఏర్పాటు చేసిన 45, 55 వార్డుల పార్టీ ఎన్నికల కార్యాలయాలను శనివారం కార్పొరేటర్లు కంపా హనోకు, కె.వి.ఎన్.శశికళతో కలిసి ఆయన ప్రారంభించారు. ముందుగా పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు.

ఉత్తరాంధ్రుల సత్తా చూపుదాం

ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఉత్తరాంధ్ర ప్రజల సత్తాను చూపించాలని పిలుపునిచ్చారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డిని మరోసారి గెలిపించుకునే బాధ్యత మనపైనే ఉందన్నారు. ఉత్తర నియోజకవర్గంలో 2014లో ఎమ్మెల్యేగా గెలిచిన విష్ణుకుమార్‌రాజుకు ఒక జెండా, ఎజెండా లేవని, 2019లో ఓటమి చెందిన తరువాత కనుమరుగయ్యారని తెలిపారు. గడచిన ఐదేళ్లలో ప్రజలకు కనిపించని ఆయన.. ఎన్నికల సందర్భంగా నియోజకవర్గంపై దొంగప్రేమ చూపుతున్నారని, ఉమ్మడి పార్టీల దత్తపుత్రుడిగా విష్ణుకుమార్ రాజు నిలుస్తారని ఎద్దేవా చేశారు.

1982 నుంచి ఉన్న దీర్ఘకాలిక సమస్యలకు సీఎం వైఎస్ జగన్ పరిష్కారం చూపారన్నారు. 75 ఏళ్ల వయసు, 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో పారిశ్రామిక రంగాన్ని విస్మరించారని, ఆయన లాంటి నాయకులు ఆలోచన కూడా చేయలేని నూతన విధానాలను వైఎస్ జగన్ ప్రవేశపెట్టారని చెప్పారు. తీరప్రాంతాన్ని సద్వినియోగం చేసుకుని పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌లను ఏర్పాటు చేశారని, ఇచ్చాపురం నుంచి అనంతపురం వరకు ప్రభుత్వ భూములను సేకరించి పారిశ్రామిక విధానాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వీకేపీసీపీఐఆర్ చైర్మన్, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు సారిపల్లి గోవింద్, ఆళ్ల లీలావతి శ్రీనివాస్, పి.ఉషశ్రీ, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ ఆలీ, కో ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, వార్డు అధ్యక్షులు పైడి రమణ, గుజ్జు వెంకటరెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, రవి రెడ్డి, ఆయా వార్డుల ముఖ్య నాయకులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, గృహసారథులు, మహిళలు పాల్గొన్నారు.


45వ వార్డు ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కె.కె.రాజు


45వ వార్డు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

ఇంటింటా కె.కె.రాజు ప్రచారం


బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతమ్మధార: స్థానిక ప్రజల సమస్యలు తెలుసుకొని వారితో మమేకం కావాలని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో శనివారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఉత్తర నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. వాటిని ప్రజలకు వివరించి పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరుతూ నివాసులకు కరపత్రాలు అందించారు. సీఎం వైఎస్ ఎన్నో సంక్షేమ పథకాలు అందించారని, అభివృద్ధిని చూసి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, కె.సుశీల, కె.సత్యనారాయణ, కరిన్‌రాజు, బల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అందరి లక్ష్యం.. వైఎస్సార్‌సీపీ విజయం


49వ వార్డులో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.రాజు


51వ వార్డు సమావేశంలో ఆత్మీయంగా పలకరిస్తున్న కె.కె.రాజు

మర్రిపాలెం: జీవీఎంసీ 49వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీ బాలాజీ ఫంక్షన్ హాల్‌లో డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు ఆధ్వర్యంలో శనివారం వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు మాట్లాడుతూ ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీకేపీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు బాణాల శ్రీనివాసరావు, లంక భాస్కర్, డైరెక్టర్లు ఎన్.రవికుమార్, ఐ.రవికుమార్, వార్డు సీనియర్ నాయకులు, బూత్ కన్వీనర్లు, మహిళలు, కార్యకర్తలు, గృహసారథులు పాల్గొన్నారు.

51వ వార్డులో ఆత్మీయ సమావేశం

జీవీఎంసీ 51వ వార్డులో ఆదిత్య టౌన్‌షిప్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును పలువురు సత్కరించి అభినందనలు తెలిపారు. ఆదిత్య టౌన్‌షిప్ సీఎండీ సాగి రవివర్మ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ కోచింగ్‌కు విశేష స్పందన


కంచరపాలెం పాలిటెక్‌లో ఉచిత కోచింగ్ రిజిస్ట్రేషన్‌కు క్యూకట్టిన విద్యార్థులు

మురళీనగర్: పదో తరగతి అనంతరం సాంకేతిక విద్యనభ్యసించేందుకు పాలిటెక్‌లో ప్రవేశానికి సంబంధించి ఏప్రిల్‌లో నిర్వహించనున్న పాలిసెట్ ఉచిత కోచింగ్‌లో చేరేందుకు విద్యార్థులు తరలివస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో ఉచిత శిక్షణ తరగతులు ఏప్రిల్ 1 నుంచి నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. విశాఖ జిల్లాలోని కంచరపాలెం, పెందుర్తి, భీమిలి బాలికల ప్రభుత్వ పాలిటెక్నిక్‌లతోపాటు కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కాలేజీల్లో ఉచిత శిక్షణ తరగతులు జరుగుతాయి. ఈమేరకు నిర్వహిస్తున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియకు విశేష స్పందన లభిస్తోంది. కంచరపాలెం పాలిటెక్నిక్‌లో శిక్షణ తరగతుల్లో చేరడానికి అత్యధిక సంఖ్యలో శనివారం విద్యార్థులు తరలివచ్చారు. వీరు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి చేరుకుని తమ పేర్లు రిజిస్టర్ చేసుకున్నారు. శనివారం ఒక్క రోజే 50 మంది పేర్లు నమోదు చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీలోపు దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఉచితంగా శిక్షణ ఇస్తామని, ఇందుకు అవసరమైన తరగతి గదులు, అధ్యాపకులను కేటాయించామని ఆయన చెప్పారు.

సేవాతత్పరుడు భూషణం మాస్టారు


భూషణం మాస్టారును సత్కరిస్తున్న ఎంఈవోలు రామారావు, బాలామణి

సీతంపేట: మధురానగర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఇంటూరి భూషణం పదవీ విరమణ సభ శనివారం పాఠశాలలో జరిగింది. హెచ్ఎం బి.దేముడుబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో భూషణం మాస్టారును ముఖ్య అతిథులు విశాఖ జిల్లా ఆర్జీవో కమిషనర్ డి.శ్రీనివాస్, సీతమ్మధార మండల విద్యా శాఖ అధికారులు డి.రామారావు, బాలామణి ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తితోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు, మొక్కల పెంపకం ద్వారా ప్లకార్డులు పట్టుకుని ప్రధాన రహదారులు, కూడళ్లలో భూషణం మాస్టారు ప్రజలకు అవగాహన కల్పించే వారని తెలిపారు. అనాథ పిల్లలకు దుస్తులు, పుస్తకాలు, భోజన వసతి కల్పించే వారని కొనియాడారు. భూషణం మాస్టారు సేవానిరతిని నేటి తరం ఉపాధ్యాయులు ఆచరించాలని సూచించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం శాంతికుమారి, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు వేణు మాస్టర్, కొట్టాల శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణ, కార్యదర్శి పెద్ద నాయుడు, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


తాటిచెట్లపాలెంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి అఖిల

సీతమ్మధార: నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను శనివారం ఉత్తర ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.అఖిల, పోలీస్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. అక్కయ్యపాలెం, కంచరపాలెం, తాటిచెట్లపాలెంతోపాటు సమస్యాత్మక కేంద్రాలను వారు పరిశీలించి మాట్లాడుతూ ఎన్నికల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తాటిచెట్లపాలెంలోని జీవీఎంసీ స్కూల్, కేంద్రీయ విద్యాలయం, కంచరపాలెంలోని ప్రైవేట్ స్కూల్స్ ప్రాంతాల్లో గల పోలింగ్ బూత్‌ల వద్ద కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గతంలో ఇక్కడ అల్లర్లు జరిగినట్లు సమాచారంతో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. డీసీపీ లక్ష్మీనారాయణ, ఈస్ట్ ఏసీపీ మెహర్ జయరాంప్రసాద్, సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ శ్రీరామమూర్తి, సీఐ ఎస్.విజయకుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ, గురుమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైభవ వేంకటేశ్వరుడికి సుప్రభాత సేవ


ఆలయ ప్రదక్షిణలో అర్చకులు, భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నసమారాధన జరిపారు. సాయంత్రం వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆలయ ప్రదక్షిణ చేశారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ముస్లింల పక్షపాతి ముఖ్యమంత్రి జగన్


ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ముస్లింలకు పెద్దపీట వేశారని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. 26వ వార్డు చిన్నూరు మసీదులో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత మహానేత వైఎస్సార్‌ది అయితే.. అంతకుమించి రాష్ట్ర చరిత్రలో ముస్లిం మైనారిటీ వర్గానికి చెందిన అంజాద్ బాషాను నాలుగున్నరేళ్ల పాటు డిప్యూటీ సీఎంగా కొనసాగించడంతోపాటు శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా ముస్లిం మైనారిటీ మహిళను నియమించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. 175 నియోజకవర్గాల్లో ఏడుగురు మైనారిటీలకు ఎమ్మెల్యే టిక్కెట్లు ఇచ్చిన ఘనత కూడా ఆయనదేన్నారు. అనంతరం జరిగిన ఇఫ్తార్ విందులో కె.కె.రాజు పాల్గొని ముస్లింలకు ఆహార పదార్థాలు వడ్డించి, వారితో కలిసి విందు స్వీకరించారు. కార్యక్రమంలో వీకేపీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, ఫ్లోర్ లీడర్, మండలాధ్యక్షుడు బాణాల శ్రీనివాసరావు, పార్టీ 26వ వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి, కార్పొరేటర్ బర్కత్ అలీ, జేసీఎస్ కన్వీనర్ బులుసు జగదీష్, మహమ్మద్ ఫరూఖీ, బి.కిరణ్, షేక్ బాబ్జి, రవిబాబు, శేషు, ముస్లిం పెద్దలు షేక్ నవాబ్, అబ్దుల్ మస్జిద్, ఎస్.కె.కాజా, బాబ్‌జాన్, పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

ఓటు విలువపై అవగాహన కార్యక్రమాలు



మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

మహారాణిపేట: ఓటు విలువపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పశ్చిమ ఆర్వో, విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ అన్నారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలోని ఆర్డీవో కార్యాలయంలో సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్(ఎస్వీఈఈపీ) బృందాలు, పశ్చిమ నియోజకవర్గ సభ్యులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలో అన్ని బూత్‌లలో నూరు శాతం ఓట్లు పోలయ్యే విధంగా ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే అనేక కాలేజీలు, ప్రాంతాల్లో ఓటర్లకు అవగాహన కల్పించామన్నారు. మరిన్ని కార్యక్రమాలు త్వరలో జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'రన్ ఫర్ జీసస్'


శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

తాటిచెట్లపాలెం: విశాఖ ఉత్తర ప్రాంత క్రైస్తవ సమితి ఆధ్వర్యంలో శనివారం రన్ ఫర్ జీసస్(క్రైస్తవ శాంతి ర్యాలీ) ఉత్సాహంగా నిర్వహించారు. తాటిచెట్లపాలెం హైవే వద్ద నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీని నియోజకవర్గంలోని పలువురు పాస్టర్లు ప్రార్థనలతో ప్రారంభించారు. తాటిచెట్లపాలెం, కైలాసపురం, కస్తూరినగర్, బాబూజీనగర్, బర్మా క్యాంప్, ఊర్వశి జంక్షన్, కంచరపాలెం ప్రాంతాల మీదుగా సంజీవయ్య కాలనీ వరకు ర్యాలీ సాగింది. గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పర్వదినాల గొప్పతనాన్ని వీరు చాటిచెప్పారు. మానవాళి కోసం సిలువపై ఏసుక్రీస్తు ప్రాణత్యాగం చేశాడని, మరణాన్ని జయించి తిరిగి లేచాడని పాటలు, బైబిలు వాక్యాలతో వివరించారు. కార్యక్రమంలో ఉత్తర ప్రాంతంలోని పలు చర్చిల నుంచి క్రైస్తవులు, యువతీ, యువకులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ నిర్ణయంపై పునః పరిశీలించాలి

విశాఖ లీగల్: వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబునాయుడు, మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ ఫిర్యాదుపై పలువురు న్యాయవాదులు విస్మయం చెందారు. పేద, బడుగు బలహీన వర్గాలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి నెలనెలా ఒకటో తేదీన వలంటీర్లు పింఛన్లు అందిస్తూ వారికి ఆసరాగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయొద్దని ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సీనియర్ న్యాయవాది వి.కాళిదాసు రెడ్డి మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ అతి ప్రాచీనమైనదని పేర్కొన్నారు. 1977లో అప్పటి జనతా ప్రభుత్వం దేశవ్యాప్తంగా వలంటీర్ల ద్వారా ఆరోగ్య, సామాజిక సేవలు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సేవలను మళ్లీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునర్ వ్యవస్థీకరించి ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకు అందేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. లక్షలాది మంది వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడే అవకాశం ఉన్న దృష్ట్యా ఎన్నికల కమిషన్ తమ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కాళిదాసు రెడ్డి కోరారు.

రైల్వే నుంచి రూ.2.58 కోట్ల పన్ను వసూలు


పన్ను వసూలు రసీదుని జెడ్సీ కృష్ణకు అందిస్తున్న ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5కు రైల్వే నుంచి రూ.2.58 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేసినట్లు అసిస్టెంట్ కమిషనర్లు(రెవెన్యూ) బాబూరావు, రాజ్యలక్ష్మి తెలిపారు. శనివారం విశాఖ రైల్వే నుంచి పెద్ద మొత్తంలో ఆస్తి పన్ను వసూలు చేసి జ్ఞానాపురంలోని కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణకు అందజేశారు. రెవెన్యూ సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ నెల 31వ తేదీ రాత్రి 7 గంటల వరకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 5 శాతం రాయితీతో ఇంటి పన్ను చెల్లించవచ్చని, పన్నుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆర్వోలు కోరారు.